క్లుప్తంగా

లీగల్ ఎయిడ్ కౌన్సిల్ 'సూర్నపాక'కు సన్మానం



సత్యనారాయణను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

ఇల్లెందు: ఇల్లెందు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సూర్నపాక సత్యనారాయణ నియమితులు అయిన విషయం విధితమే. ఈ సందర్భంగా ఆయనను ఇల్లెందులోని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య క్యాంపు కార్యాలయం వద్ద గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పూనెం సురేందర్, యశోద, కల్తీ పద్మ, పాయం స్వాతి, చుక్కమ్మ, చాట్ల భాగ్యమ్మ, తాటి రాంబాబు, మడుగు సాంబమూర్తి, తాటి భిక్షం పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

జూలూరుపాడు: తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ సభ్యుడు ధరావత్ రామ్మూర్తి నాయక్ అన్నారు. గురువారం ఆయన జూలూరుపాడు, వెంగన్నపాలెం, జడలచింత, పాపకొల్లు, భీమ్లాతండా, కొమ్ముగూడెం, కరివారిగూడెం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజలకు ఏ విధంగా మేలు జరుగుతుందో వివరించారు. నున్నా కృష్ణయ్య, బానోత్ నవీన్ రాథోడ్, కొలిపాక వెంకటేశ్వర్లు, కొమ్మినేని రాంబాబు, కొలిపాక శ్రీనివాసరావు, మందా బాబు, బాదావత్ సామ్యా, బానోత్ కిషన్, తదితరులు పాల్గొన్నారు.

కొమరారంను మండలంగా ప్రకటించాలి



ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

ఇల్లెందురూరల్: కొమరారం కేంద్రంగా నూతన మండలాన్ని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో గురువారం కొమరారంలో ప్రదర్శన నిర్వహించారు. గ్రామపంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తరగతులను బహిష్కరించి ప్రదర్శనలో పాల్గొన్నారు. మండల సాధన కమిటీ కన్వీనర్ మోతీలాల్, మూడు మాలు, జోగ కృష్ణ, ప్రవీణ్, దేవా, నగేష్, సుమన్, పాపన్న, రాజేశ్వరి, రాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ ఆధారంగానే ఎంపికలు



మాట్లాడుతున్న హెచ్‌ఎం చందు

పాల్వంచరూరల్: గిరిజన మోడల్ క్రీడాపాఠశాలలో విద్యార్థుల ఎంపిక ప్రక్రియ ప్రతిభ ఆధారంగానే జరుగుతుందని హెచ్‌ఎం చందు అన్నారు. స్థానిక పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కిన్నెరసానిలోని గిరిజన క్రీడా పాఠశాలలో 2023–2024 విద్యా సంవత్సరానికి గాను 6నుంచి 9వ తరగతుల ఇంగ్లిష్ మీడియంలో విద్యార్థుల ఖాళీల భర్తీ కోసం ఐటీడీఏ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 1వ తేదీన బ్యాటరీ టెస్టు ద్వారా ఎంపికలు పారదర్శకంగా నిర్వహించినట్లు చెప్పారు. అడ్మిషన్ ఇవ్వడానికి డబ్బులు అడిగినట్లు వస్తున్న ఆరోపణలో వాస్తవం లేదన్నారు. ఒకవేళ ఉంటే ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వానాకాలం.. ప్రాణాలు పదిలం

- అన్నదాతలు.. అప్రమత్తంగా ఉండాలి
- నివారణ మార్గాలు పాటించాలి



ట్రాక్టర్‌తో దుక్కి సిద్ధం చేస్తున్న రైతు

ఇల్లెందురూరల్: వర్షాకాలం వచ్చిందంటే రైతన్నలకు తీరిక ఉండదు. ఉదయం నుంచి రాత్రి వరకు పొలంలో ఏదో ఒక పని ఉంటూనే ఉంటుంది. సాధారణంగా ఇతర కాలాలతో పోల్చుకుంటే వర్షాకాలంలోనే కర్షకులు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతుంటారు. పొలం వద్ద ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ప్రాణాల మీదకొస్తుంది. విద్యుత్, పాములు, పిడుగులు.. ఇలా ఎన్నో విధాలుగా ప్రమాదాలు పొంచి ఉంటాయి. ప్రకృతి వైపరీత్యంగా పడే పిడుగులు, ట్రాక్టర్‌తో దమ్ము చేసేటప్పుడు అవి తిరగడబడటం వంటి సంఘటనలు రైతుల ప్రాణాల మీదకు తెస్తాయి. వీటిని విద్యుదాఘాతాలు తోడవుతాయి. అయినప్పటికీ రైతులు వాటికి భయపడకుండా పరుగులు పెడుతూనే ఉంటారు. చికిత్స కన్నా నివారణే ఉత్తమం.. ప్రతీ క్షణం అప్రమత్తంగా ఉంటూ పనులు చేసుకుంటేనే క్షేమం. ప్రస్తుతం వానాకాలం సాగు పనుల సందర్భంగా ఎదురయ్యే ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు.

పిడుగులు ప్రాణాలు తీస్తాయి..

వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన సమయంలో అనుకోకుండా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వస్తుంది. అలాంటప్పుడు తడవకుండా ఉండేందుకు చెట్ల కిందకు వెళ్తుంటారు. సహజంగా పిడుగులు చెట్లపైనే పడతాయని తెలిసినా ఆ సమయంలో మర్చిపోతుంటారు. ప్రతిఏటా జిల్లాలో పిడుగులు పడి పదుల సంఖ్యలో రైతులు మరణిస్తున్నారు. మనుషులతోపాటు మూగజీవాలు సైతం పిడుగుపాటుకు బలవుతున్నాయి. ఆకాశం నుంచి మెరుపులు, ఉరుములు వస్తుంటే చెట్ల కింద, ఎత్తైన ప్రదేశాల సమీపానికి వెళ్లవద్దు. పశువులు కూడా వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ తీగలు, విద్యుత్ ప్రవాహ వస్తువులకు దూరంగా ఉండాలి. ఇలాంటి సమయంలో మొబైల్ ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేస్తే మరీ మంచిది.

విద్యుదాఘాతాలు..

చాలామంది రైతులు చేలల్లో తమ మోటార్లు, స్టార్టర్లకు ఎలాంటి రక్షణ ఏర్పాట్లు చేయరు. వర్షాకాలంలో ఇది చాలా ప్రమాదం. వర్షం నీరు వాటిలోకి చేరి వాటిని ఆన్ చేసే సమయంలో విద్యుదాఘాతం జరిగే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా పంట చేలల్లో తెగిన విద్యుత్ తీగలు తగిలి పశువులు మృత్యువాత పడుతున్నాయి. ఈ సమయంలో మనుషులు వెళ్లినా గమనించకుంటే అదే పరిస్థితి. రాత్రి పూటెప్పుడో అవి తెగడం, ఉదయం వాటిని గమనించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వేకువ జామునే చేనుకు వెళ్లాల్సి వస్తే తప్పకుండా చూసుకుంటూ ముందుకెళ్లాలి. చీకట్లో వెళ్లాల్సి వస్తే చెప్పులు, టార్చి మర్చిపోవద్దు.

ట్రాక్టర్లు తిరగబడుతున్నాయి..

దమ్ములు, ధాన్యం చేరవేత సమయంలో ప్రమాదాలు జరిగి రైతులు ప్రాణాలు కోల్పోతున్నారు. దమ్ము చేసే సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాక్టర్ గోతిలో దిగేటప్పుడు దానిని అతివేగంతో ముందుకు వెళ్లనివ్వడం వల్ల ట్రాక్టర్ తిరగబడుతోంది. గట్టు ఎక్కేటప్పుడు జాగ్రత్త పాటించకపోవడం వల్ల కూడా తిరగబడతాయి. అందువల్ల ఎక్కువ శాతం చిన్న ట్రాక్టర్లు దమ్ములకు ఉపయోగిస్తే ప్రమాదం అంతగా ఉండదు. పెద్ద ట్రాక్టర్ ఉపయోగించినా ట్రాక్టర్ ఇంజన్‌పై ఉండే టాప్ తీసేయడం వల్ల ట్రాక్టర్ తిరగబడినా డ్రైవర్ తప్పించుకునే అవకాశం ఉంటుంది.

పాములతో ప్రమాదం ఎక్కువే..

వ్యవసాయ పనులకు వెళ్లిన సందర్భాలలో పాములు, తేళ్లు వంటి విషచరాల వల్ల ప్రమాదాలు చాలానే జరుగుతుంటాయి. కలుపు తీసే సమయంలో, గట్ల మీద నుంచి వెళ్తున్నప్పుడు కాటేసే ప్రమాదం ఉంటుంది. జాగ్రత్తగా గమనిస్తూ వెళ్లాలి. ఒకవేళ ఏదైనా కాటేసినట్లు అనుమానం ఉంటే నాటు వైద్యులను ఆశ్రయించకుండా సమీపంలోని ఆస్పత్రికి వెళ్లాలి. పొలం నుంచి రహదారి మీదకు వీలైనంత త్వరగా బాధితుడిని తీసుకొచ్చి త్వరితగతిన ఆస్పత్రికి చేర్చాలి.

పురుగు మందు పిచికారీతో జాగ్రత్త...

పంటలకు ఆది నుంచి తెగుళ్లు ఆశించడం ప్రస్తుతం సర్వసాధారణం. రైతులు వాటి నివారణకు పురుగు మందులు పిచికారీ చేస్తుంటారు. ఈ సమయంలోనే అప్రమత్తంగా ఉండాలి. తగిన జాగ్రత్తలు పాటించాలి. గాలికి వ్యతిరేక దిశలో మందులు పిచికారీ చేయకూడదు. పూర్తిస్థాయిలో రక్షణ చర్యలు తీసుకోవాలి. డబ్బాలపై ఎరుపు రంగు గుర్తు ఉన్న మందులు అత్యంత ప్రమాదకరంగా గుర్తించాలి. చేనుకు మందు పిచికారీ చేసే సమయంలో చేతులకు తొడుగులు ధరించాలి. ముక్కు, నోటికి మాస్క్ వాడాలి. పిచికారీ తరువాత డబ్బాలను గోరు వెచ్చని నీటితో శుభ్రం చేయాలి. చేతులను ఒకటికి రెండుసార్లు సబ్బుతో కడుక్కోవాలి.



పురుగుమందు పిచికారీ చేస్తున్న కూలీ

ప్రథమ చికిత్సపై అవగాహన ఉండాలి



రైతులు పొలం పనులు చేసేటప్పుడు వివిధ కారణాలతో ప్రమాదాలకు గురవుతుంటారు. పిడుగులు పడటం, పాము కాటుకు గురికావడం, పిచికారీ సమయంలో మందు ప్రభావానికి గురికావడం, రాత్రివేళలో విద్యుదాఘాతం వంటివి చోటుచేసుకున్నప్పుడు సంఘటన స్థలంలోనే కొంతైనా అవగాహన ఉన్నవారు వెంటనే ప్రథమ చికిత్స చేయాలి. – డాక్టర్ లోహిత, వైద్యాధికారి, కొమరారం పీహెచ్‌సీ

గిరిజనుల కళ్లలో ఆనందమే నా కల..



వనమాకు స్వాగతం పలుకుతున్న పోడు రైతులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పోడు పట్టాల కోసం ఎన్నో పోరాటాలు చేశాను. గిరిజనుల కళ్లలో ఆనందం చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉందని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండల పోడుపట్టాల లబ్ధిదారులకు గురువారం కొత్తగూడెం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పట్టాలను అందజేశారు. మొదటి పోడు రైతులు వనమాకు ఘనస్వాగతం పలికారు. వనమా మాట్లాడుతూ... లక్ష్మీదేవిపల్లి మండలంలో పన్నెండు వందల మందికి పోడు పట్టాలు ఇస్తున్నట్లు తెలిపారు. పోడుపట్టాలతో ప్రతిపక్షాల నోర్లు మూతపడ్డాయని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కారణజన్ముడన్నారు. ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చి గిరిజనులకు ఆరాధ్యదైవంగా నిలిచారని కొనియాడారు. సంక్షేమ పథకాలు పొందిన ప్రతిఒక్కరూ మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 4లక్షల ఎకరాలకు పోడుపట్టాలు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కొత్తగూడెం నియోజకవర్గాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నటు చెప్పారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తుదిశ్వాస వరకు ప్రజాసేవలోనే ఉంటానన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఎంపీపీలు భూక్యా సోన, బాదావత్ శాంతి, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ శ్రీవాసరావు, ఎంపీటీసీలు కొల్లు పద్మ, బాబూరావు, కోఆప్షన్ సభ్యుడు జక్కుల సుందర్, సర్పంచ్‌లు, కార్యదర్శులు, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పోడు వివాదాలకు శాశ్వత పరిష్కారం



ఒడ్డుగూడెంలో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందురూరల్: సుదీర్ఘకాలంగా పల్లెల్లో నెలకొన్న పోడు భూముల వివాదాలకు సీఎం కేసీఆర్ కృషి వల్లే పట్టాల రూపంలో శాశ్వత పరిష్కారం లభించిందని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. మండలంలోని పలు గ్రామపంచాయతీలలో గురువారం గిరిజన రైతులకు పోడు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతిఏటా వర్షాకాలంలో గిరిజన రైతులకు, అటవీశాఖ అధికారుల నడుమ వివాదాలు, ఘర్షణలు చోటుచేసుకుంటూ పోలీసు స్టేషన్ మెట్లెక్కారని గుర్తుచేశారు. ఇలాంటి పరిస్థితులకు స్వస్తి పలుకుతూ సీఎం కేసీఆర్ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రణాళికా బద్ధంగా పోడు భూములకు పట్టాలు పంపిణీకి శ్రీకారం చుట్టారని చెప్పారు. భవిష్యత్‌లో అడవి జోలికి వెళ్లకుండా ఉండేలా ప్రతిఒక్కరూ తమకు తాము ప్రతిజ్ఞ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, వైస్‌ఎంపీపీ దాస్యం ప్రమోద్ కుమార్, ఎంపీటీసీ పూనెం లింగమ్మ, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీడీఓ బాలరాజు, ఎంపీఓ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన..

ఒడ్డుగూడెం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ప్రారంభించారు. అనంతరం ఒడ్డుగూడెం నుంచి మాధారం గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మాట్లాడుతూ.. తండాలను, గూడేలను గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దంతోపాటు పల్లె పాలనకు అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం సమకూర్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, వైస్‌ఎంపీపీ దాస్యం ప్రమోద్‌కుమార్, ఎంపీటీసీ పూనెం లింగమ్మ, బీఆర్‌ఎస్ నాయకులు శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ఇల్లెందు: తాడ్వాయి పోలీసులు ప్రజా నాయకుల మీద అకారణంగా మోపిన ఉపా చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని అఖిలపక్ష రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. గురువారం ఇల్లెందులో ఎన్డీ ఆధ్వర్యంలో గోవింద్ సెంటర్‌లోని పెన్షనర్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. నేతలు, ప్రజాసంఘాల, పౌరహక్కుల సంఘం నేతలు కె.ఉమామహేశ్వరరావు, సుడిగాలి వెంకటనర్సయ్య, బయ్యా శారద, రేళ్ల నాగలక్ష్మి, జడ సీతారామయ్య మాట్లాడారు. అకారణంగా ప్రజా సంఘాల నేతల మీద మోపిన అక్రమ కేసులను రద్దు చేయాలని, ఉపా చట్టం రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలేటి సంధ్య, స్వరూప, మోకాళ్ల సుగణ, మోకాళ్ల రమేష్, రాసుద్దీన్, ఏ.సాంబ, ఆర్.ఉమా పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న మద్దెల శివకుమార్

పాల్వంచ: బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం జీవితాన్ని త్యాగం చేసిన, భారత ఉప ప్రధానిగా దేశానికి విశేష సేవలందించిన స్వాంతంత్ర్య సమరయోధలు బాబూ జగ్జీవన్‌రామ్ అని దళిత సంఘం సీనియర్ నాయకుడు కొత్తపల్లి సోమయ్య, కాల్వప్రకాశ్ అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక విగ్రహం వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముళ్లపూడి రాజేందర్, మిరియాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీను, గొడ్ల మోహన్‌రావు, చర్ల వెంకటప్పయ్య, గజ్జి శ్రీను, కటుకూరి వెంకటేశ్వర్లు, కొప్పుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: బాబూ జగ్జీవన్‌రామ్ దళిత జాతికి అందించిన సేవలు చిరస్మరణీయం అని భారతరత్న అంబేడ్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సంఘం కార్యాలయంలో గురువారం జగ్జీవన్‌రామ్ 37వ వర్ధంతి నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. హనుమంతు, అంతోటి పాల్, దుర్గేష్, లావుడ్యా సత్యనారాయణ, సుధీర్, విజయభాస్కర్, పరుశురాం, దుర్గా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు రాయితీ కల్పించండి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న టీజేఎఫ్ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు గత సంవత్సరం జారీ చేసినట్లు ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం రాయితీని కల్పించాలంటూ టీజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్ ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులు, జిల్లా విద్యాశాఖధికారి సోమశేఖరశర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన రెండు రోజుల్లో జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని ప్రైవేటు పాఠశాలకు సర్క్యూలర్ జారీ చేస్తామని హామీ ఇచ్చారు.

మెడికల్ కళాశాలలో రిజర్వేషన్ పెంచండి



మాట్లాడుతున్న అంతోటి నాగేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): రామగుండం మెడికల్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం 5శాతం ఎంబీబీఎస్ సీట్లలో రిజర్వేషన్ కల్పించే విధానాన్ని స్వాగతిస్తున్నామని, ఇది హర్షించతగిన విషయం, కానీ 5శాతం రిజర్వేషన్ వలన కార్మికుల పిల్లలకు 7 సీట్లు మాత్రమే వస్తున్నాయని, 10శాతం రిజర్వేషన్ కల్పించి కార్మికుల పిల్లలకు ఆదుకోవాలని సింగరేణి కాలరీస్ ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోషియేషన్ జనరల్ సెక్రటరీ అంతోటి నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక అసోషియేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మాల కొండయ్య, శ్రీకాంత్, బందెల విజేందర్, వెంకటేశ్వర్లు, సుమన్ పాల్గొన్నారు.

బీఎంఎస్‌లో చేరిక

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని బంగ్లోస్, (ఇల్లెందు గెస్ట్ హౌజ్)లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులు గురువారం బీఎంఎస్‌లో చేరారు. వీరికి ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శి పి.మాధవనాయక్ యూనియన్ కండువాలు కప్పి ఆహ్వానించారు. టీఎస్ పవన్‌కుమార్, కృష్ణారెడ్డి, నాగేశ్వరరావు, నిర్మల, రాకేష్, వై.రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి

చుంచుపల్లి: జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతిని బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీజిల్లా ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ.. దేశం కోసం ఎనలేని సేవలు అందించారన్నారు. ఆకుల నాగేశ్వరరావు, నరేంద్రబాబు, రంజిత్, లక్ష్మణ్ అగర్వాల్, రవీందర్ పాల్గొన్నారు.

కృష్ణారావు మృతికి సంతాపం

జూలూరుపాడు: కరివారిగూడెం గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ తాటికొండ కృష్ణారావు ఇటీవల మృతి చెందారు. గురువారం కృష్ణారావు దశదిన కర్మ కార్యక్రమానికి రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు హాజరై ప్రగాఢ సంతాపం తెలిపారు.

గురుకులంలో వైద్యశిబిరం

టేకులపల్లి: మండల కేంద్రంలోని బీసీ బాలుర గురుకులంలో మండల వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. 96 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని డాక్టర్ దినేష్ సూచించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, స్థానిక ప్రిన్సిపాల్ చైతన్య, స్టాఫ్ నర్స్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సీత్లా పండగకు సెలవు ప్రకటించాలి

టేకులపల్లి: బంజారాల సీత్లా పండగకు ప్రభుత్వం సెలవు ప్రకటించాలని బద్దుతండా పంచాయతీ సంద్యాతండా బంజారా యువకులు, విద్యార్థులు బాదావత్ రంజిత్‌కుమార్, అనిల్, సురేష్, మోహిత్, గణేష్, సాయి, మనోహర్, చిన్ని, నరసింహ కోరారు. ఈ మేరకు గురువారం తండాలో వారు మాట్లాడుతూ.. ఈనెల 11న వేర్వేరుగా కాకుండా బంజారాలంతా సామూహికంగా ఒకేరోజు సీత్లా పండుగ జరుపుకోవాలని కోరారు.

ఆర్థిక సాయం

టేకులపల్లి: దాసుతండా పంచాయతీ లచ్చాతండాకు చెందిన తేజావత్ సాల్లి ఇటీవల మృతి చెందారు. గురువారం ఆమె దశదిన కర్మల కార్యక్రమానికి హాజరైన తెలంగాణ జన సమితి (టీజేఎస్) ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుగులోత్ భద్రు నాయక్ బాధిత కుటుంబానికి రూ.4వేల ఆర్థిక సాయం అందించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటానని చెప్పారు.

సమాన హోదా కల్పించండి



మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించేంత వరకు టీబీజీకేఎస్ యూనియన్‌తోపాటు అన్ని జాతీయ కార్మిక సంఘాలకు సమాన హోదా కల్పించాలని కార్మిక సంఘాల నాయకులు యాజమాన్యాన్ని కోరారు. గురువారం జాతీయ కార్మిక సంఘాల నాయకుల సమావేశం జరిగింది. నాయకులు మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం ఏరియాలోని వివిధ విభాగాలలో నిర్వహించే మైన్స్ డిపార్ట్‌మెంట్లలో, సేఫ్టీ కమిటీ సమావేశాల్లో కూడా జాతీయ కార్మిక సంఘాలకు ప్రధాన్యం కల్పించాలని, కార్పొరేట్ జీఎంలు, ఏరియా యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేయాలని సూచించారు.

సమావేశంలో వీరస్వామి, వంగా వెంకట్, ఆల్బర్ట్, మొగిలిపాక రవి, విజయగిరి శ్రీనివాస్, క్రిష్టాపర్, కొత్తపల్లి రమేష్‌బాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు నిజాన్ని దాస్తున్నారు



మాట్లాడుతున్న సంధ్య

పాల్వంచ: పాల్వంచ పోస్ట్‌మెట్రిక్ బాలికల వసతి గృహంలో మహిళా వార్డెన్ భర్త తరచు వసతి గృహంలోకి వచ్చి విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, అయినా ఐటీడీఏ అధికారులు మాత్రం వాస్తవాలను కప్పిపెడుతున్నారని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.సంధ్య, కాంపాటి పృథ్వీ ఆరోపించారు. గురువారం వసతి గృహంలో విద్యార్థినులతో మాట్లాడారు. గిరిజన ఆశ్రమంలో తరచు ఇలాంటివి జరగడం అధికారుల వైఫల్యమే కారణమన్నారు. వార్డెన్ భర్త వసతి గృహంలోకి వస్తున్నాడని పలుమార్లు విద్యార్థి సంఘాలు, విద్యార్థులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ చేసి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రణాళికతో మంచి ఫలితాలు సాధించాలి





హాజరైన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

కొత్తగూడెంఅర్బన్: పాఠశాలల స్థాయిలో ప్రణాళికలు తయారు చేసుకొని పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి ఇ.సోమశేఖరశర్మ అన్నారు. గత సంవత్సరం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు, ఇతర విద్యా అంశాలపై గురువారం స్థానిక సింగరేణి పాఠశాలలో ఉపాధ్యాయులతో రివ్యూ నిర్వహించారు. ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులకు ఆగస్టు నుంచి స్పెషల్ క్లాసులు నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఎస్‌సీఈఆర్‌టీ విడుదల చేసిన అకడమిక్ క్యాలెండర్‌ను ప్రతి పాఠశాలలో అమలు చేయాలని చెప్పారు. యూనిఫాం, టెక్ట్స్ బుక్స్ రాలేదనే సమస్య ఉండకూడదన్నారు. జిల్లాలో ఈనెల 10, 11 తేదీలలో ఎస్‌ఎస్‌ఏ గ్రాంట్స్‌పై ఆడిట్ జరుగుతుందని తెలిపారు. ప్రతి పాఠశాలలో సబ్జెక్టు టీచర్స్ కొరత త్వరలో తీరనున్నదని వివరించారు. ఉపాధ్యాయులు తరగతి గదిలో మొబైల్ ఉపయోగించరాదన్నారు.

సమావేశంలో ఏసీజీఈ ఎస్.మాధవరావు, ఎఫ్ఏఓ విప్లవకుమార్, మండల విద్యాశాఖాధికారులు, ఎస్ఎస్ఏ కోఆర్డినేటర్లు, ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ స్పెషలాఫీసర్లు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె



చుంచుపల్లి: కొత్తగూడెం బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న పంచాయతీ సిబ్బంది

డిమాండ్ల సాధనకు గ్రామ పంచాయతీ కారోబార్లతో పాటు సిబ్బంది కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో నిరవధిక సమ్మెబాట పట్టారు. మొదటి రోజు గురువారం మండల కేంద్రాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీ సిబ్బంది సమ్మెకు పలు కార్మిక సంఘాల జేఏసీ నాయకులతో పాటు రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయి. – సాక్షి నెట్‌వర్క్



సుజాతనగర్: సమ్మెలో పాల్గొన్న కార్మికులు





టేకులపల్లి: మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు, జూలూరుపాడులో...



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న నాగేశ్వరరావు